బాధితులకు నష్టపరిహారానికి చర్యలు

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలపై దాడుల కేసుల్లో బాధి తులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల వివరాలను పరిశీలించి విచారణ పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న పార్వతీపురం, కురుపాం, పాలకొండ శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో వాస్తవాలు తెలుసుకుని కేసులను నమోదు చేయాలని కోరారు. ఆ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, వారికి రావాల్సిన పరిహారాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్ మాట్లాడుతూ జనవరి 2024 నుంచి 25 కేసుల్లో వివిధ దశల్లో రూ. 41.25లక్షలు పరిహారంగా మంజూరు చేశామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ ఎస్. అంకిత మహావీర్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, ఆర్‌డీఓ కె.హేమలత, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి


మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి

పార్వతీపురంటౌన్: సురక్షిత ప్రసవమే ధ్యేయంగా గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. ఈ మేరకు ఆశ నోడల్ అధికారులతో ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ త్వరితగతిన గర్భిణుల నమోదు చేపట్టి కాన్పు పూర్తయ్యే వరకు ప్రణాళిక బద్ధమైన ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని, ఆరోగ్య తనిఖీల నివేదికలు ఎంసీపీ కార్డులో స్పష్టంగా నమోదు చేయాలని చెప్పారు. గర్భిణి ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితకాలంలోనే సాధారణ ఆరోగ్య స్థితి పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గర్భిణిని హైరిస్క్‌గానే పరిగణించాలని సూచించారు. సాధారణ ప్రసవాలు అన్నీ ఆ పరిధిలోని పీహెచ్‌సీలో జరగాలని స్పష్టం చేశారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి సకాలంలో టీకాలు వేయాలని, ఆశ కార్యకర్తలు షెడ్యూల్ ప్రకారం బాలింతల గృహ సందర్శన చేసి పర్యవేక్షించాలని చెప్పారు. ఐసీడీఎస్ శాఖ సిబ్బంది సమన్వయంతో సంపూర్ణ పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. వైద్యారోగ్య శాఖ పంపిణీ చేసిన మొబైల్ ఫోన్లను 70మంది ఆశ కార్యకర్తలకు సంబంధిత నోడల్ అధికారుల ద్వారా అందజేశారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్‌మోహన్‌రావు, డీఐఓ డా.నారాయణరావు, డీపీఎంఓ డా. రఘుకుమార్, జిల్లా నోడల్ అధికారి డా.వినోద్, డీపీహెచ్‌ఎన్‌ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్లలో మంచినీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

పార్వతీపురం: అమృత్ 2.0 పథకంలో భాగంగా ఇళ్ల లేఅవుట్లలో మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లో అమృత్ 2.0 పథకంపై నిర్వహించిన సమావేశంలో జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రస్తుత పరిస్థితిపై పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలతో కలిసి సమీక్ష చేశారు. తాగునీటి పైపుల లీక్‌ల ద్వారా తాగునీరు వృథా అవుతోందని, లేఅవుట్ల వద్ద మంచినీరు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. జిల్లా ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారి కేజీఎస్ నర్సింగరావు, లేఅవుట్లలో మంచినీటి సదుపాయం కల్పించేందుకు అమృత్ 2.0 పథకం కింద పార్వతీపురం మున్సిపాలిటీకి రూ.5.02 కోట్లు, సాలూరు మున్సిపాలిటీకి రూ.3.20కోట్లు, పాలకొండ నగర పంచాయతీకి రూ. 2.16 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పథకాలకు సంబంధించి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలపగా పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని కలెక్టర్ ఆదేశించారు.

తుంపర సేద్యం కింద రూ.53.79 లక్షలు విడుదల

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో 750మంది తుంపర సేద్యం లబ్ధిదారులకు రూ.53.79లక్షల నిధులు విడుదల కోసం పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతుకు ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు తరపున చిన్న, సన్నకారు రైతులకు 55శాతం రాయితీ, పెద్ద రైతులకు 45శాతం రాయితీ, ఇప్పటికే అందజేశామని, దీనికి అదనంగా ప్రతి గిరిజన రైతుకు రూ.7,172లు ఐటీడీఏ తరపున రాయితీ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. పథకం పొందదలచిన గిరిజన రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెట్ల కట్టింగ్ ఉండడం వల్ల ఉదయం ఉదయం 8గంటల నుంచి 2గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశ్వవిజ్ఞాన స్కూల్, వైభవ జ్యూయలర్స్ నుంచి సౌందర్య థియేటర్ మెయిన్ రోడ్డు వరకు, పోస్టాఫీసు, ప్రభుత్వ ఆస్పత్రి, జీజే కళాశాల రోడ్డు, మైదానం వీధి, అగ్రహారం వీధి, క్రాలేటి వారి వీధి, గొడు వీధి, గెడ్డవీధి, నాయుడు వీధి, బూరాడ వీధి, నారాయణ స్కూల్ ఏరియా, హరిజన వీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని వివరించారు.

మండలంలో..

11కేవీ అడ్డాపుశీల సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మండలంలో ఉదయం 8గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ పేర్కొన్నారు. అడ్డాపుశీల, బంటువానివలస, బాలగుడబ, వీఆర్ పేట, నర్సపురం, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెబుతూ ప్రజలు సహకరించాలని కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


విద్యార్థి యోగేంద్రకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది, పక్కనే ప్రధానోపాధ్యాయుడు దేవానంద్

గుమ్మలక్ష్మీపురం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మండలంలోని దిగువమండ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దేవానంద్ సూచించారు. అదే గ్రామంలోని అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగేంద్ర, చక్రీధర్, పూజిత, శ్రీసాయికృష్ణలు జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన.. వైద్యారోగ్య సిబ్బందిని వారి వద్దకు తీసుకువెళ్లి, వైద్యసేవలు అందించారు. ఒకట్రెండు రోజుల్లో తగ్గకపోతే గుమ్మలక్ష్మీపురం గానీ కురుపాం గానీ వెళ్లి అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందాలని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

తెగులు నివారణకు నీమాస్త్రం


నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: ఖరీఫ్ వరి పంటలో వచ్చే తెగులు నివారణకు రైతులు మెలకువలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని బుడ్డిపేటలో వరి పంటలను పరిశీలించిన అనంతరం నీమాస్త్ర తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. నీమాస్త్రం తయారీకి 100లీటర్ల నీరు, దేశీయ ఆవుపేడ 1కేజీ, ఆవు మూత్రం 5లీటర్లు, వేపాకు రెమ్మల ముద్ద 5కేజీలు, పుట్టమన్ను పిడికెడు తీసుకుని వాటన్నిటినీ ముందుగా డ్రమ్ములో వేసి ఉంచి ఉదయం, సాయంత్రం పూట ఒక నిమిషం వ్యవధి పాటు కులుపుకోవాలని సూచించారు. ఇలా 48 గంటల పాటు ఉంచిన తరువాత వడకట్టి ఒక ఎకరం విస్తీర్ణం ఉన్న వరిచేను మడిలో నీమాస్త్రం ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల 300 రకాల తెగుళ్ల నివారణకు ఉపయోగ పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పి.లక్ష్మణ్, వినయ్‌తేజ, రైతులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుపై పశువులు కట్టడం తగదు


పశువులను రోడ్డుపై కట్టవద్దని ప్రజలకు వివరిస్తున్న సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ జగదీశ్వరరావు తదితరులు

సీతానగరం: నిరంతరం ప్రజలు తిరుగాడే వీధుల్లో పశువులు కట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న కారణంగా సీసీరోడ్డుపై పశువులు కట్టడాన్ని అరికట్టాలని పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక సర్పంచ్ ఎం.శ్రీదేవి అధ్యక్షతన ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, గ్రామపెద్ద చిరంజీవులు, ఉపసర్పంచ్ వెంకటరమణ, సచివాలయ అధికారులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వర్షాలు కురవడం, వీధుల్లో చెత్త పడవేయడం, ఇళ్లముందు పశువులను సీసీ రోడ్డుపై కట్టడం వల్ల ప్రజలు దోమల బారిన పడుతూ అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ పెద్దలంతా ఏకమై పశువులను సీసీ రోడ్లపై కట్టడాన్ని నిషేధిస్తూ తీర్మానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

• ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర


తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ చంద్ర

పార్వతీపురంటౌన్:

దేశ భాషల్లో తెలుగు ఎంతో తీయనైనదని ఎంతోమంది కవులు, మహనుభావులు పేర్కొన్న గొప్ప భాష తెలుగని, దానిని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే విజయ చంద్ర అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతృభాషలో బోధన జరిగితే పిల్లలకు పట్టు సాధించే అవకాశం ఉందని పోటీ పరీక్షల్లో రాణించగలరన్నారు. ఆంగ్లం నేర్చుకోవడం వరకు ఫరవాలేదని, అన్ని రాష్ట్రాలు తమ మాతృభాషకు ప్రాధాన్యమిస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు. కూటమి ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి తన వంతు కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో గురువారం తెలుగుభాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.రత్నకుమారి మాతృభాష గొప్పతనం, తెలుగుభాష విశిష్టత, గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన కృషి, సేవలను విద్యార్థులకు వివరించారు. అలాగే క్రీడా దినోత్సవంలో భాగంగా ధ్యాన్‌చంద్ దేశం కోసం చేసిన సేవను వివరించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పద్మావతి, పార్వతి, రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంసృృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.


సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో విద్యార్థులు


పాలకొండ: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వెంకమపేట ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలికి సన్మానం


వీరఘట్టం: సంప్రదాయ వస్త్రధారణలతో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తలవరం హైస్కూల్ విద్యార్థులు


సీతంపేట: గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీఓ చిన్నబాబు


జియ్యమ్మవలస: పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి


జియ్యమ్మవలస: చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విన్యాసం

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి పురస్కరించుకుని, తెలుగు భాషా దినోత్సవం.. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధికారులు, ఉపాధ్యాయులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఆయా రంగాల్లో వారు చేసిన కృషిని కొనియాడారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని వాడుక భాషలో ఉన్న మాధుర్యాన్ని, విలువను తెలియజేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని, తనదైన ఆటతీరుతో ప్రపంచ హాకీ చరిత్రలో భారత్ పేరు నిలబెట్టిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని ప్రశంసించారు. ఆదర్శప్రాయుల జీవిత చరిత్రలను అందరూ తెలుసుకుని, ఉన్నతమైన సమాజ నిర్మాణానికి వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. - పాలకొండ, కురుపాం


కొమరాడ కేజీబీవీలో గిడుగు రామ్మూర్తి, తెలుగు తల్లి వేషధారణల్లో విద్యార్థులు, పక్కనే ఉపాధ్యాయులు


గుమ్మలక్ష్మీపురంలోని డిగ్రీ కళాశాలలో తెలుగు కవిత్వాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవరం


భామిని: మోడల్ స్కూల్ తెలుగు పండితులు, పీఈటీని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు


పాలకొండ రూరల్: తంపటాపల్లిలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


వీరఘట్టం: సంప్రదాయ వస్త్రాలంకరణతో హాజరైన విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న చిదిమి పాఠశాల ఉపాధ్యాయులు

క్లుప్తంగా

కోరంలేక ఎన్నిక వాయిదా

సీతానగరం: మండలంలో గతంలో వివిధ కారణాల వల్ల ఎన్నికలు నిర్వహించని ప్రాథమిక పాఠశాల మేనేజ్(ఎస్‌ఎంసీ)మెంట్ కమిటీల ఎన్నికలు గురువారం నిర్వహించ తలపెట్టగా మళ్లీ వాయిదా పడినట్లు ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీపీఎస్ అంటిపేట, కొత్తవలస పాఠశాలల్లో ఎన్నికలకు సిద్ధం కాగా రెండు పాఠశాలల్లో కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు.

నేడు వన మహోత్సవం

పార్వతీపురం: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీతానగరం మండలంలోని గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ.ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో వనమహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో 2029 సంవత్సరం నాటికి 50శాతం భూభాగంలో మొక్కలతో నిండి ఉండాలనే సంకల్పంతో మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

736 మద్యం సీసాలు ధ్వంసం


వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యం సీసాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

సీతానగరం: మండల పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో ఇటీవల అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్న 23 కేసుల్లో 736 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో సీజ్ చేసిన 736 మద్యం సీసాలను ఏఎస్పీ అంకిత సురానా ఆధ్వర్యంలో ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జి.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు


మామిడిపల్లి జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.ఇందులో భాగంగా గురువారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌తో కలిసి పట్టణంలో పర్యటించారు. మామిడిపల్లి జంక్షన్, గాంధీనగర్ జంక్షన్, రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఈ మూడు రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని, హెచ్చరిక బోర్డులు, విద్యుత్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అమర్చాలని సీఐ ఈ సందర్భంగా సూచించారు.కార్యక్రమంలో ఎస్సై సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుకు గాయాలు

భామిని: మండలంలోని గజపతినగరం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డ్ కొండగొర్రి లక్ష్మణరావు గాయాలపాలయ్యారు. బత్తిలి స్టేషన్‌లో విధులు నిర్వహించి స్వగ్రామం అత్తికొత్తూరుకు ఆయన బైక్‌పై వెళ్తుండగా ముందు వెళ్తున్న కారును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో గాయాల పాలైన హోంగార్డ్‌ను భామిని పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు.బైక్ ముందు వెళ్తున్న కారు రోడ్డు గోతులలో సడన్ బ్రేక్ వేయడంతో హోంగార్డు బైక్ కారు వెనుక భాగాన్ని ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

తక్షణమే పెండింగ్ కేసులు పరిష్కరించాలి


పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

గరుగుబిల్లి: తక్షణమే పెండింగ్ కేసులను పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్ చర్యలను ముమ్మరం చేసి, నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ చేసి, గంజాయి, సారా రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, తదితరులు ఉన్నారు.